క్లుప్తంగా

బారికేడ్ల వితరణ

జమ్మలమడుగు : ఇటివల బైపాస్ రోడ్డులో ప్రమాదాలు జరిగి వాహనదారులు మరణిస్తుండటంతో మానవతా సంఘం బారికెడ్లను వితరణ చేసిందని సీఐ సదాశివయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రొద్దుటూరు బైపాస్‌రోడ్డులో మానవతా సంఘం అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, మాధవరెడ్డిలు సీఐకి అందించారు. ప్రమాదాల నివారణ కోసం బారికెడ్లతో, డ్రమ్ములను వితరణ చేయడం మంచి పరిణామం అన్నారు. వాహనదారులు వేగం కన్న ప్రాణాలు మిన్న అన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యుల గురించి ఆలోచన చేసి వాహనాలు నడుపాలని సూచించారు.

అమర వీరుల స్మారక బోర్డుల ఏర్పాటు

లింగాల : మండలంలోని గ్రామాల్లో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, ఆజాదీకా అమృత్ సరోవర్ చెరువుల వద్ద స్వాతంత్ర్యం కోసం పోరాడి అమరులైన వారిని స్మరించుకునేందుకు అమరవీరుల స్మారక బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున వారిని స్మరించుకుని హారతులు ఇచ్చి నివాళులర్పించి జెండా వందనం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ప్రతి ఇంటికి జాతీయ జెండాను అందిస్తాం



ఎమ్మెల్యేకు జాతీయ జెండాను అందిస్తున్న పోస్టల్ సిబ్బంది

జమ్మలమడుగు : ఆగస్టు 15 పురస్కరించుకుని వచ్చె మంగళవారం నాటికి ప్రతి ఇంటికి జాతీయ జెండాను అందించడమే తమలక్ష్యమని పోస్టర్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మొదటి జాతీయ జెండాను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డికి పోస్టల్ సిబ్బంది అందించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలనే ఉద్దేశ్యంతో పోస్టల్ శాఖ తరపున ప్రతి ఇంటికి కచ్చితంగా జాతీయ జెండాను అందించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మొదటి జాతీయ జెండాను ఎమ్మెల్యే ఇచ్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూర డివిజన్ మేనేజరు విజయ్‌బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాపై దాడి అమానుషం

కమలాపురం : పట్టణంలోని 13వ వార్డు 2వ అంగన్‌వాడీ కేంద్రం ఆయాగా పనిచేస్తున్న రసూల్ బీపై దాడి చేయడం అమానుషం అని ఏఐటీయూసీ నాయకురాళ్లు జ్యోతి, రాణి, లక్ష్మీదేవి, నాగలక్ష్మీ తదితరులు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 3వ తేదీన అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్న మీటింగ్‌కు వర్కర్ వెళ్లడంతో ఆయా మాత్రమే సెంటర్‌లో విధులు నిర్వహించింది. భోజనం సమయంలో చిన్నారులకు చేతులు శుభ్రం చేస్తుండగా నిహంత్ అనే చిన్నారి పరుగెడుతూ సాంబారు గిన్నెను తన్ని అందులోనే కూర్చున్నాడు. ఈ ఘటనలో చిన్నారికి గాయాలయ్యాయి. పొరపాటున జరిగిన ఈ ఘటన పట్ల చిన్నారి తల్లిదండ్రులు ఆయాపై కేసు నమోదు చేయించారు. కాగా బుధవారం మధ్యాహ్నం పిల్లలకు భోజనం వడ్డించే సమయంలో గాయపడ్డ చిన్నారి తల్లిండ్రులతో పాటు వారి బంధువులు ఆయా రసూల్‌బీను బయటికి ఈడ్చుకొచ్చి కొట్టి గాయపరిచారు. ఆయాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారిని గుర్తించండి

పులివెందుల టౌన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారిని గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, సచివాలయ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సర్టిఫికెట్లు పొంది వాటి ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారిని గుర్తించాలన్నారు. అలాగే జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్లు పొంది ఇంకా రూ.35వేలు కట్టని లబ్ధిదారులను గుర్తించి వెంటనే వారిచేత కట్టించాలన్నారు. సచివాలయం వారీగా టార్గెట్లను విధించి పూర్తి చేయాలన్నారు.

యువత సన్మార్గంలో నడవడంతోనే దేశాభివృద్ధి

పులివెందుల రూరల్ : యువత సన్మార్గంలో నడవడంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని అర్బన్ సీఐ రాజు తెలిపారు. బుధవారం మా ఊరి సిన్మా హీరో పులివెందుల మహేష్ పుట్టినరోజు సందర్భంగా మా ఊరి సిన్మా యూనిట్, స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్, డాక్టర్ నవీన్, రక్తనిధి మెడికలాఫీసర్ శుభశ్రీ, హీరో మహేష్‌లతో కలిసి అర్బన్ సీఐ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్మాత మంజునాథరెడ్డి, ఏఎస్ఐ చంద్రశేఖర్(స్వామి), చిత్ర యూనిట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగంతోనే స్వాతంత్య్రం సిద్ధించింది



పులివెందులలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు



వీఎన్‌పల్లెలో ప్రమాణం చేస్తున్న విద్యార్థులు



ఎర్రగుంట్లలో రిటైర్డు ఆర్మీ వీరులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

కమలాపురం : ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితంతోనే స్వాతంత్ర్యం సిద్ధించిందని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరవీరుల జ్ఞాపకార్థం ఈనెల 9 నుంచి 30వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బుధవారం ఆ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో నా మట్టి.. నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లాకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్స్ అశోక్ కుమార్, అయ్యవార్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో బుధవారం మేరా మాటి – మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ అమల్ ఆరోగ్య రాజ్ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శంకరయ్య, కళాశాల అధ్యాపకులు సుధీర్, గంగాదేవి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : దేశం అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌నాయుడు అన్నారు. బుధవారం నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని నందిపల్లెలో మేరి మాటి–మేరి దేశ్ కార్యక్రమంలో భాగంగా నందిపల్లె గ్రామ సర్పంచ్ ఎం.సులోచనమ్మ ప్రభుత్వ భవన సముదాయాల్లో వసుధ వందనం నిర్వహించి అనంతరం ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎస్ఆర్టీ కో ఆర్డినేటర్ ఎం.శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుళరెడ్డి, అధ్యాపకులు, సచివాలయ సెక్రటరీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మేరా మాటి–మేరా దేశ్

జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో మేరా మేటి–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వలంటీర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సైనికులకు వందనం తదితర కార్యక్రమాలు ఈనెల 9వ తేదీనుంచి 16వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు జాతీయ సేవా సమితి అధికారులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో నా మట్టి- నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం రిటైర్డు ఆర్మీ వీరులకు ఘనంగా సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతు దేశం కోసం సేవ చేసిన రిటైర్డు ఆర్మీ వీరలకు ఘనంగా సన్మానించడం ఎంతో సంతోకరమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి. జగన్నాథ్, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో.

జమ్మలమడుగు : నామట్టి–నాదేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వీర జవాన్‌లను స్మరిస్తూ జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరిండెంటెంట్ డాక్టర్ రఫిక్ పాషా మాట్లాడుతూ దేశ సరిహద్దులో మన జవాన్‌లు దేశ రక్షణ చేస్తుండటంతో మనం ఇక్కడ హాయిగా నిద్రపోతున్నామన్నారు.

వల్లూరులో..

వల్లూరు : ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాయపల్లె చెరువు, గోటూరు ఎంపీపీ పాఠశాల, తప్పెట్ల గ్రామ సచి వాలయాల వద్ద నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం శిలా ఫలకాలను ఆవిష్కరించి జాతీయ జండాలను ఎగురవేశారు. అనంతరం మొక్కలను నాటారు. జిల్లా టూరి జం అధికారి మల్లికార్జున్, ఎంపీడీవో జుబేద, ఏపీవో పార్థ సారధి, అటవీ శాఖ ఏబీవో ఉష పాల్గొన్నారు.

2 వార్డులకు నోటిఫికేషన్ విడుదల

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు వీరపునాయునిపల్లె మండలంలో రెండు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న రెండు వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని 9వ వార్డు, ఎస్.పాలగిరి పంచాయతీ పరిధిలోని 6వ వార్డుకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం సాయంత్రానికి ముగుస్తుందన్నారు. 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు 3 గంటల తరువాత పోటీలో ఉన్న తుది జాబితాను ప్రకటించడం జరుగుతందన్నారు. 19వ తేదీన మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

నేటి మహా ధర్నాను విజయవంతం చేయండి

వేంపల్లె : ఈనెల 10వ తేదీన కడప జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఉన్న సర్పంచ్‌లకు మద్దతుగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని.. సర్పంచ్‌లందరూ ధర్నాకు హాజరు కావాలని ఆయన కోరారు.

కమిటీ సభ్యులు విద్యార్థులకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి

చెన్నూరు : మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో బుధవారం మండలస్థాయి పాఠశాలల భద్రతా కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ ఈ కమిటీ నందు సభ్యులందరూ మండలంలోని అన్ని పాఠశాలలను తరచుగా సందర్శించి విద్యార్థి, విద్యార్థినులకు భద్రత కొరకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మండల అభివృద్ధి అధికారి గంగనపల్లి సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన ఆపేయాలి

లింగాల : టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారని.. నీవు పాదం మోపగానే రాష్ట్రంలో కరువు ఛాయలు నెలకొన్నాయని.. నీవు ప్రాజెక్టుల సందర్శన వెంటనే ఆపేయాలని లింగాల ఇన్‌చార్జి ఎంపీపీ అలవలపాటి రమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2014–19 మధ్య కాలంలో పులివెందుల ప్రాంతంలో వర్షాలు కురవక అన్నదాతు అల్లాడుతుంటే నీవు రాక్షసానందం పొందావని.. నీ హయాంలో చీనీ పంటలను కాపాడుకునేందుకు రైతులు పడిన ఆగచాట్లు అన్నీ ఇన్నీ కావని.. అన్నదాతలు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడేవాళ్లన్నారు. అటువంటి పరిస్థితులలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఐఏబీ మీటింగ్‌లలో కొట్లాడి సాగునీటి కోసం పాదయాత్రలు చేశారని.. సొంత నిధులు వెచ్చించి తుంపెర డీప్ కట్ కెనాల్‌లో పూడికతీత పనులు నిర్వహించారన్నారు. ఈ ప్రాంతానికి నీరు తీసుకొచ్చేందుకు కృషి చేసిన చరిత్ర వైఎస్ కుటుంబానిదన్నారు. బాబు నీవు దిగిపోయి వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలు.. ఇప్పుడు కరువు దేవుడిగా పేరు గాంచిన మీరు ఈ ప్రాంతంలో కాలు మోపావో అప్పటి నుంచి రాయలసీమలో వర్షాలు కురవడం ఆగిపోయాయన్నారు. పక్కనున్న తెలంగాణాలో భారీ వర్షాలు కురుస్తున్నా ఇక్కడ చినుకు రాలడంలేదన్నారు. మరోసారి మీరు ఈ ప్రాంతానికి రావద్దని అన్నదాతలు చేతులెత్తి వేడుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ పుష్ప, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబురెడ్డి, వెలిదండ్ల గ్రామ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగృహాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : మండల వ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన హౌసింగ్ సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేముల, వి.కొత్తపల్లె జగనన్న కాలనీలతోపాటు వ్యక్తిగతంగా సొంత స్థలాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సకాలంలో పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు సహకరించాలని సూచించారు. హౌసింగ్‌కు సంబంధించి బిల్లులు పడక పోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. అనంతరం హౌసింగ్ డీఈ మాట్లాడుతూ లబ్ధిదారుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని, అలాగే బ్యాంకు ఖాతాలు లావాదేవీలు లేకపోవడంవల్ల కొంతమంది లబ్ధిదారుల ఖాతాలు కనిపించడంలేదని.. అలాంటి వాటిన్ని సరిచూసుకునేలా లబ్ధిదారులకు సూచించాలన్నారు. బిల్లులు పడక పోతే ఎందుకు పడలేదో సమీక్షించుకోవాలన్నారు. అలాగే లబ్ధిదారులకు సకాలంలో సిమెంటు, మెటీరియల్ అందించాలని.. త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, హౌసింగ్ ఏఈ రామసురారెడ్డి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత అధికారులు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ సూచించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఆమె నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు తాగునీటి సమస్యలే కుండా చేయడంతోపాటు రాబోయే వర్షకాలంలో తాగునీటి పైప్‌లైన్‌లలో మురికి నీరు రాకుండా చర్యలను తీసుకోవాలన్నారు. కాలువల్లో ఉన్న మురికిని తొలగించి నీరు కాలువల్లో ప్రవహించేలా చేయాలన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంలో మున్సిపాలిటీలో 20 వార్డుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేయడంతోపాటు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులను చేశామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ఇళ్లులేని నిరుపేదలకు నాలుగువేలకుపైగా ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు ఇంటిని కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. టిడ్కో ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు డిసెంబర్‌లోగా పంపిణీ చేస్తామన్నారు. వార్డు కౌన్సిలర్లు సమస్యలు తమ దృష్టికి తీసుకునివస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో మువ్వన్నెల జెండాల విక్రయం

వల్లూరు : ప్రతి తపాలా కార్యాలయంలో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు ప్రొద్దుటూరు తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్ తెలిపారు. వల్లూరులోని పోస్టల్ కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జండాలను అందుబాటులో వుంచి కేవలం రూ.25 లకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. www.epostoffice.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆర్డర్ పెడితే తమ సిబ్బంది నేరుగా వారి ఇంటి వద్దే జాతీయ జెండాను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ పతాకాలు కావల్సిన వారు తమ సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో పోస్ట్ మాస్టర్ రమాదేవి, సిబ్బంది, బీపీఎంలు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి) లో(రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568 286189, 9963170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తొండూరు : స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ అరిపుల్లా ఆధ్వర్యంలో బుధవారం పీఎం స్వాశ్య మాతృత్వ అభయాన్(పీఎంఎస్ఎంఏ) కింద గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ పరీక్షలు, రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఐరన్ సుక్రోజ్ సేవలు, పోషకాహార లోపం, రక్తహీనతకు మార్గం, సురక్షిత ప్రసవం గురించి ఆరోగ్య అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య కుమార్తె మన్విత పుట్టిన రోజు సందర్భంగా గర్భిణులకు రక్తహీనత రాకుండా చిక్కీలు, లడ్డూలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, ఆరోగ్య పర్యవేక్షకురాలు శశికళ, కమ్యూనిటీ హెల్త్ అధికారిణులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యాధికారి లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మానవత సంస్థ అధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ నాకుమారుడు వెంకటరాజేష్ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డి, కార్యదర్శులు, కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు పక్కాగా చేపట్టాలి



పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : పంట కోత ప్రయోగాలు పక్కాగా చేపట్టాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌బీకే-4లో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై ఆమె శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందిన సిబ్బంది పంట కోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలన్నారు. ఈ ప్రయోగాలు పంట దిగుబడి అంచనా, రాష్ట్ర ఆదాయాన్ని లెక్కించడం, ఉత్పత్తి, ఉత్పాదకత లెక్కింపు అంశాలను పరిగణనలోకి తీసుకోవడానికి దోహద పడ తాయన్నారు. అనంతరం పంట కోత ప్రయోగాలు చేసే విధానాన్ని ఏఎస్ఓ ఇర్షాద్ బేగం వివరించారు. అలాగే క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఏఈఓ దస్తగిరి పంటకోత ప్రయోగాల యాప్ పనితీరు, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంటల బీమా ఈ పంటకోత ప్రయోగాలపై ఆధారపడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుదిదశకు చేరుకున్న సిద్ధేశ్వరస్వామి ఆలయ నిర్మాణం



తుదిమెరుగుల్లో ఉన్న సిద్ధేశ్వరాలయం

చక్రాయపేట : నాటకాలతో దేశ విదేశాల్లో ప్రసిద్ధి గాంచిన సురభి గ్రామంలో ఘణమైన చరిత్ర గల సిద్ధేశ్వరస్వామి ఆలయ నిర్మాణం అద్భుతంగా తయారవుతోంది. ఈ ఆలయ నిర్మాణం కోసం అల్లపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, అల్లపురెడ్డి సరితలు రూ.10 లక్షలు విరాళంగా ఇవ్వగా మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు ప్రత్యేక చొరవ చూపి రూ.40 లక్షలు సీజీఎఫ్ ఫండ్ మంజూరు చేయించారు. దాతలు మరో రూ.20 లక్షలు జమ చేయడంతో ఆలయ నిర్మాణం కళానైపుణ్యంతో సుందరంగా తయారవుతోంది. సిద్ధేశ్వరాలయం పూర్వం సురభి సంస్థానం వైతరణి పుణ్యనదీ తీరంలో వెలసి ఉంది. ఈ ఆలయాన్ని జనమేజయ మహారాజు ప్రతిష్టింప చేసినట్లు గ్రామ ప్రజలు చెబుతారు. అలాంటి ఈ ఆలయం పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో అల్లపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ముందుకు వచ్చి వైఎస్ కుటుంబం సహకారంతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. అయితే ఆలయానికి ప్రహరీ కూడా అవసరం కావడంతో పాడా నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు అయ్యాయి. బండ్లయ్యగారిపల్లె వద్ద నుంచి సిమెంట్‌రోడ్డు ఏర్పాటుకు మరో రూ.35 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆపనులు కూడా ప్రారంభం అయ్యాయి. త్వరలోనే ఆలయ నిర్మాణంతో పాటు ప్రహరీ, రోడ్డు పనులు పూర్తి చేసి పునః ప్రతిష్టాపనా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. తమ గ్రామంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేసిన అవినాష్‌రెడ్డి, కొండారెడ్డిలకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి



నులిపురుగుల నివారణ పోస్టర్లను విడుదల చేస్తున్న రవీంద్రనాథరెడ్డి, తదితరులు

వేంపల్లె : నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని వేంపల్లె మండల స్పెషలాఫీసర్ డాక్టర్ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించి తాళ్లపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించిన గోడ పత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెప్పులు లేకుండా నడవడం, మట్టిలో ఆడటం, చాక్‌పీస్, బలపాలు, మట్టిని తినడంవల్ల శరీరంలో నులి పురుగులు తయారవుతాయన్నారు. ఈ పురుగులు పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని, దీని కారణంగా పిల్లలు భుజించిన ఆహారం ఒంటికి పట్టకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా నులి పురుగులు పిల్లల శరీరం నుంచి బయటకు పోతాయన్నారు. దేశంలోని ప్రతి బిడ్డను నులి పురుగులు లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య శాఖ విశేష కృషి చేస్తోందన్నారు. అలాగే డాక్టర్ స్వాతిసాయి మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఎంఈఓ బండి వీరారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా బేగం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు



ఆస్పరి ఫకురుబీ

పులివెందుల : నూర్‌బాషా దూదేకులకు షాదీ తోఫా పథకం కింద రూ.లక్ష ఇవ్వడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు అని నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ ఆస్పరి ఫకురుబీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ షాదీ తోఫా కింద రూ.లక్ష ఇవ్వడంతోపాటు గతంలో షాదీ తోఫా కింద కాకుండా కళ్యాణమస్తు కింద రూ.5వేలు అందని జంటలకు ఇప్పుడు మళ్లీ మరో రూ.50 వేలు కలిపి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. దూదేకుల మీద ఇంత ప్రేమ చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

సమ్మెకు వెళ్లేముందు ఆలోచించండి

చక్రాయపేట : తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు వెళ్లేముందు ప్రజల సమస్యనూ ఒక్కసారి ఆలోచించాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు విద్యుత్ సిబ్బందికి సూచించారు. బుధవారం గండి క్షేత్రంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆయనతో పాటుప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ముఖ్య ఇంజనీరు అయ్యూబ్‌ఖాన్, జిల్లా ఎస్ఈ రమణలు విద్యుత్ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది సమ్మెకు దిగితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఈ విషయంపై తాము కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన వారికి వివరించారు. ప్రభుత్వం నుంచి మీకు సానుకూల నిర్ణయం వస్తుందని సిబ్బంది అందరూ ప్రజలకు సమస్యలు రాకుండా విదులకు హాజరుకావాలని కోరారు. అనంతరం వారు వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈఈలు శ్రీకాంత్, రమేష్ రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని ఎల్లారెడ్డిపల్లె సచివాలయంలోని అప్పారావుపల్లె, నసంతపురం గ్రామాలలో గురువారం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషా చలపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురం రాముని గుడి వీధిలోని మూడు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో వాటర్ పైపులైన్ కొరకు కాలువ తీస్తున్న సందర్భంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.